# కొడుకు - కూతురు

ఎండి గుర్రాల మీద స్వారిజేస్తూ రోహిణి కార్తె వచ్చి వారం రోజులైంది.

తొలకరి వానలు ఇంకా మొదలుకాలేదు.

దుమ్ము ధూళితో కూడిన ఎర్రగాలులు సాయంత్రాల్ని చీకాకుపరుస్తున్నాయి.

మట్టిపని నుంచి తోటి కూలీల్తో కలిసి లక్ష్మమ్మ ఇంటికొచ్చేసరికి తమ్ముడి దగ్గర నుంచి "నాయన తిండి మానేసిండు. సీరియస్‌గా ఉంది ర"మ్మంటు ఉత్తరం వచ్చి ఉంది.

పొద్దు కూకుతోంది.

వెళ్లాలని ఆతృతగా ఉంది.

బస్సులుండే సమయం కాదు నడిచే దూరం కాదు.

ఏం జరిగిందో ఊహించేందుకు ప్రయత్నిస్తూ రాత్రంతా గడిపింది.

ఉదయమే ప్రయాణమై పది గంటలకంతా వూరు చేరుకొంది.

ఇంట్లో కెళ్ళి చేసంచి చిలక్కొయ్యకు తగిలిస్తూ కుశల ప్రశ్నలకు సమాధానాలిచ్చింది.

కాళ్ళు, ముఖం కడుక్కుంటూ చూపుల్తో వెదకింది.

మంచినీళ్ళు తాగుతూ పరిసరాల్ని పరిశీలించింది.

చివరకు తమ్ముణ్ణి అడిగింది "నాయనేడరా?" అంటూ.

"కొట్టంలో..." అతని స్వరం జీరగా సంకోచించింది.

చే సంచిలోని అరటిపళ్ళలో కొన్ని తమ్ముడి పిల్లల కిచ్చి, సంచితో కొట్టంలోకి నడిచింది.

నులక మంచం మీద వెల్లకిలా పడుకొని ఉన్నాడు ఆయన. కళ్ళు మూసికొని ఉన్నాడు. తెల్లగా జానెడు పొడవున పెరిగిన గడ్డంతో కండరాల్లేని ఎముకల గూటి శరీరంతో తపస్సమాధిలో మునిగిన మునీశ్వరుడిలా ఉన్నాడు.

"నాయనా!" పిల్చింది. "ఓ నాయనా"

కళ్ళు తెరిచాడు.

స్పష్టత కోసం టపటప రెప్పలార్పుతూ చూశాడు.

పోల్చుకోలేని నిస్సహాయత కళ్ళలో స్రవించిన నీటి తడిపై ప్రతిఫలించింది.

"ఎవరూ...?" హీనస్వరంతో ప్రశ్నించాడు.

"నేనేలే నాయనా?" గట్టిగా చెప్పింది.

కళ్ళు పోల్చుకోలేని రూపాన్ని చెవులు పసిగట్టాయి.

చేతులు రెండూ వజవజ వణుకుతూ అప్యాయంగా పైకి లేచాయి.

"లచ్చుమ్మా" అంటూ లేచేందుకు ప్రయత్నించబోయాడు.

"పండుకో...పండుకో..." వారించింది.

"ఎప్పుడొచ్చినవమ్మా? పిల్లలు బాగుండారా?" అడిగాడు. శరీరంలోకి ఏదో అర్థంగాని సత్తువవచ్చి చేరింది ఆయనకు.

"వాడేసిన జాబు నిన్న మాపిటేల వచ్చింది. పొద్దున్నేసి పరిగెత్తుకుంటా వస్సాండ" సంచిలోంచి అరటిపండు తీసి వల్చి "ఇదిగో...ఈ పండు తిను" అంటూ ముందుకు చాచింది.

"యేందమ్మా అది?"

"అర్టిపండులే."

"వద్దమ్మా... వద్దు."

"వాని సొమ్ము గాదులే ఇది. నేను కష్టం జేసిన లెక్కతో కొనక్కొచ్చినా."

కళ్ళు మూసికొని మౌనంగా ఉన్నాడు. కొద్దిసేపు తర్వాత తల అడ్డంగా ఊపుతూ "వద్దమ్మా!" అన్నాడు సన్నగా. రెప్పల చాటునించి ఉబికి వచ్చేందుకు ప్రయత్నిస్తోంది కన్నీరు.

ఒక రోజు కూలి ఖర్చుపెట్టి ఉంటుందామె. తన చేతి పండయినా తింటాడని కొండంత ఆశతో వచ్చి ఉంటుంది.

"నువ్విట్లా కూడుదినకుండా ఎన్రోజులు బతుకుదామని?" బాధగా అడిగింది.

"సజ్జామనే"

"పరువుగా బతికేటోడు. వానికి సెడ్డ పేరు రాదూ?"

"రావాలనే"

ఆశ్చర్యపోయింది ఆమె.

గారాబానికి అర్థం తెలిసేలా వాణ్ణి సాకిన వాడు...

వాడిబాగు కోసం అవసరమయితే ప్రాణాలివ్వటానికయినా సిద్ధపడిన వాడు...

ఇప్పుడు వాడి చెడ్డనే కోరుకుంటున్నాడంటే... ఆందోళన కలిగింది మనస్సులో ఆమెకు.

"వాడు నీ కొడుకు నాయనా!" చెప్పింది.

కాదన్నట్లుగా తల అడ్డంగా ఊపాడు. "నా సేతి పిడ్స తింటా వున్నెప్పుడు వాడు నాకొడుకు."ఇప్పుడు వాడి సేతి పిడ్స నేను తింటాండ. నేనే వాని కొడుకును. నేను వాన్నెట్లా సాకిన్నో వాడూ నన్నట్లే సాకాల." చెప్పాడు.

"సదూకున్నోడు ఉజ్జోగం సేస్కుండేటోడు. వాడేమంత పనికిమాల్నోడు కాదులే నాయనా"

"కాని దాన్నే నన్నీడ గొడ్లకొట్టంలో నన్నాపడేసిండు."

ఆయన బాధ అర్థమైంది.

"ఈ ఎండాకాలం మిద్దెలో ఉడుకని కొట్టంలో మంచమేసి ఉంటార్లే. ఈన్నే మేలుగాదూ?" చెప్పింది.

"అట్లనుకొని నన్ను కొట్టంలో ఎయ్యలే! నా కంపు దూరంగా ఉండాలనే." బాధ సుడులు దిరిగింది ఆయన కంఠంలో.

లేని ఓపికదెచ్చుకొని గుండె ముడి విప్పాడు ఆయన. కోడలి అనాదరణ, కొడుకు నిర్లక్ష్యాన్నిగురించి వాపోయాడు. 'ఈ బతుక్కంటే చావేనయ'మని తను నిర్ణయించుకొన్నట్లుగా కూడా చెప్పాడు.

"నా సావుతోనన్నా వానికి బుద్ధి రావాల. వానెట్టాటి కొడుకు లందరికీ తెలివి రావాల" చెప్పాడు.

"వాడేం జేస్తడు? అమ్మయ్య అట్టాంటిదైపాయే. పొద్దున్న ఉజ్జోగానికి పోతే మాపిటేల ఇంటికి వచ్చేటోడు. వానికేం దెల్సు?"

తమ్ముణ్ణి సమర్థించింది.

"సేసేదంతా వాడే" కసిగా అన్నాడు.

"అయితే మా ఊరికిరా! నా కాన్నే ఉందూగాని" అంది.

క్షణకాలం ఆయన చెవులు అర్థం చేసికోలేకపోయాయి.

అర్థమైన తర్వాత నమ్మలేకపోయాయి.

నమ్మకం కలిగిన తర్వాత భరించలేకపోయాయి.

శరీరం వజవజ వణికింది. వణికే చేతిలెత్తి ఆమె చేతుల్ని గట్టిగా పట్టుకున్నాడు. జారిపోతాయేమో నన్నంత భయంగా ఆమె అరచేతుల్ని చెంపల కానించుకొన్నాడు.

కూలి పని ఆమె అరచేతుల్లో పండించిన బొబ్బల కాయలు అతని చెంపలకు ముళ్ళల్లా గుచ్చుకొంటున్నాయి.

ఆమె కలాంటి బతుకిచ్చింది తనే.

పనిజేస్తే కడుపు నిండాల

లేకుంటే పస్తులండాల.

ఆమె తన నోటికాడి ముద్దలో సగం తుంచి తనకిస్తానంటోంది.

ఆమె కోసం తనేం చేశాడని?

"ఏం నాయనా? మా ఊరికి రావా" అడిగింది మళ్ళీ.

తల అడ్డంగా ఊపాడు. "రానమ్మా"

"నువ్విట్లా కూడు నీల్లుగ్గబట్టి ఎండుతా ఉంటే మా కాడ తిండి ఁయిస్తదా? యీడ సరిపోలేదు సరే... మా వూరికిరా నాయనా మా కుండలో కలిగింది మాతోబాటు యింత తిని వుందురా. మా పిల్లలల్లో నిన్నూ ఒకనిగా సాక్కుంటం" అంది గద్గదంగా.

కరిగిపోయాడు ఆయన. కన్నీళ్ళు ఉబికి వచ్చాయి.

మనస్సు మూగగా రోదించసాగింది.

"నన్ను క్షమించమ్మా? నీతోటి రాలేను. నీ సేతిపిద్స అరగించుకోలేను. కాలిపోయే నా బతుకు మీద ఆముద మంటిన తమలపాకులా కప్పుకోకు తల్లీ?"

"నీకు నే నేమిచ్చినానమ్మా? పుట్టుకనిచ్చినా అంతే గదా?"

"వానితో బాటే నువ్వూ పుట్టినా వానిదారులేమన్నా నీ కిచ్చిన్నా?"

"బఱ్ఱెతోక లెంట నిన్నూ..."

"బడి గోడల్లోకి వాన్ని..."

"నన్ను క్షమించు తల్లీ"
"వాని సదూకోసం నీ పెండ్లయ్యేదాకా రెక్కలు ముక్కలయ్యేట్లు నీ చేత పన్జేయిస్తిని".
"నీ కేమిచ్చినానమ్మా?"
"ఏమియ్యలే"
"నీ ఎంగిలి పాలు తాగినోనికే అన్నీ యిచ్చినా".
"ముసిలోల్లను సాకాలన్నా, వాళ్ళకు తల కొరివి పెట్టాలన్నా, వాళ్ళ వంశం నిలపాలన్నా, వాల్ల ఆస్తిని తినాలన్నా... హక్కులన్నీ వానికే ఇచ్చినా. వాన్ని నా వారసున్ని చేసేటందుకే నిన్ను దూరంగా యిసిరేసినా. నీకు చీరసారెల్ని కూడా ఎగవేసి వాని కోసం ఖర్చు జేసినా".
"వాన్ని సుఖాల కుర్చీ ఎక్కించేందుకు మీ అమ్మ ఆరోగ్యాన్ని, వూపిరినీ, నా జవసత్వాల్ని ఖర్చు జేసినా".
"వాడిప్పుడు నా ముసలివాసన భరించలేకపోతున్నాడనీ, పిడ్స పెట్టలేదనీ, గొడ్ల కొట్టంలో పడేశాడనీ కరిగి కరిగి కన్నీటి యేటివై పరుగెత్తుకొచ్చావు".
"వద్దు తల్లీ నన్ను జాలిగా చూడొద్దు. నాకలా జరగాల్సిందే. కొడుకునో కంటా, కూతుర్నో కంటా చూసే నాలాంటి తండ్రుల కిట్లా జరగాల్సిందే. నన్నీ శిక్షను అనుభవించనీ తల్లీ!"
లోలోపల ఆక్రోశించాడు.
మూసిన కనురెప్పల చాటునుంచి కన్నీళ్ళు ధారాపాతంగా కురుస్తున్నాయి.
కొంత అర్థమైంది ఆమెకు.
సంచి అక్కడే ఉంచి మెల్లిగా లేచింది. ఇంట్లో కెళ్ళింది.
"ఎట్లరా?" అంది తమ్మునితో విషయం చెప్పి
"ఆస్తి అంతా నాకోసం ఖర్చు చేసి ఇప్పుడు నీ కాడ తినాలంటే అభిమానపడుతున్నాడు" అన్నాడు అతను.
"ఏడనో సోట ఒక పిడ్స తినాలగదా?" బాధగా అంది.
"నా ఉద్దేశ్యమూ అదే అక్కా! ఆయన్ను పసిపిల్లోడిలా చూసుకొనే బాధ్యత మాకుంది. కాబట్టి మేము పోషించే పద్ధతి ఎంత బావున్నా ఆయనకు తృప్తినివ్వదు. నా భార్య ఏమంత ఓపిక మనిషి గాదు. ఎవరోకరు కొత్తవాళ్ళు వస్తుంటరు. వాళ్ళ ముందు ఈయన దగ్గుతా వూస్తా ఉంటే బావుంటదా? అందుకే ఆయన మంచాన్ని కొట్టంలోకి చేరిస్తే అలిగి తిండి చాలించిండు... నీకాడ అదేం వుండదు, వేళ కింత పడేస్తే చాలు అదే అపురూపంగా భావిస్తాడు. ఎందుకంటే ఆ బాధ్యత నీది కాదు కాబట్టి" అన్నాడు.
తమ్ముని కేసి పరిశీలనగా చూసింది ఆమె. "వీడేనా ఇట్లా మాట్లాడేది?' అన్నట్లుగా చూసింది.
"అట్లనీ...నీకాడ వూరకే తినడు. నెల కింత లెక్క పంపిస్తాంట. కూడు బెట్టు" చెప్పాడు.
చురచుర చూసిందామె. "నాయనకు తిండి బెట్టడానికి నీకాడ నేను లెక్కదీసుకోవాల్నంటరా?" అంది.
తలొంచుకున్నాడు అతను.
"ఇంగెప్పుడూ అట్లా మాట్లాడొద్దు" అంటూ తండ్రివద్దకు నడిచింది.

కళ్ళెత్తి చూశాడు.

పక్కనే కూచుని ఆయన కళ్ళలోకి చూస్తూ దీనంగా అది - "నాయనా నేన్దెచ్చిన పండు గూడా తినవా?" అని.

బ్రతిమిలాడింది.

భంగపడింది.

కన్నీళ్ళు పెట్టుకొంది.

చివరకు ఎలాగయితేనేం ఆయన చేత పండు తినిపించింది. నిమ్మరసం ఇచ్చింది. నీళ్ళు తాపింది.

తర్వాత అడిగింది - "నాయనా నువ్వు మా ఊరికి రావాల" అని.

"రాలేనమ్మా!"

"మా పిల్లోల్లకు తోడుగా మా యింటికి పెద్ద దిక్కుగా ఉందూగానిరా"

హృదయం కదిలిపోయింది ఆయనకు. "నా మీదెందుకమ్మా నీకింత మర్లు? నిన్ను నే నేనాడూ అంత యిదిగా సూస్కోలేదే. మంచి రయిక గుడ్డ గూడా కుట్టియ్యలేదే" అన్నాడు గొంతు జీరవోతుండగా - కల్లెంట నీళ్ళు ఉబికుబికి వస్తూండగా.

"మగదిక్కు లేకుండా పడున్న నీకు చెయ్యన్నా అందియ్యలేదే?"

"ఆ మాటల్తో పన్లే. నువ్వు మా ఊరికి రావాల."

"రాలేనమ్మా!"

"నువ్వు కూడు నీల్లుగ్గబట్టి సస్తాంటే నే న్జూడలేను. నీతోబాటు నేను గూడా తిండి మానేసి యీడనే పడుంటా." దృఢంగా చెప్పింది.

"అమ్మా" ఆందోళనగా అన్నాడు.

"నే నీడుంటే తిండిలేక ఆడ నా పిల్లల్జస్తరు. అందరు కల్సే సజ్జం." చెప్పింది.

బావురుమన్నాడు.

తర్వాత మాట్లాడింది ఆమె - రాళ్ళు కరిగిపోయేలా.

చివరకు ఒకషరతు మీద ఒప్పుకొన్నాడు.

"వాడు నెలకింత లెక్క నీకు పంపించాల అట్లయితే వస్నా."

తన నింకా ఆడపిల్లగానే చూస్తోన్న తండ్రికేసి నిస్సహాయంగా చూసింది ఆమె.

రెక్కల కష్టంతో తన పిల్లలకే కడుపునిండా తిండి పెట్టకోలేని ఆమె జీవితంపైకి గొంగళి పురుగులా పాకటం ఆయనకు ఇష్టం లేదు.

అందుకే జీతం ఒడంబడిక.

* * * *

ఇప్పుడాయనకు హాయిగానే ఉంది.

పెద్ద పిల్లలిద్దరూ తల్లివెంట కూలికిపోతే, మిగిలిన ఇద్దరు చిన్న పిల్లలతో బాగా పొద్దుపోతోంది.

వాళ్ళ బీద తిండి నోటికి చాలా రుచిగా ఉంది. కాలే కాలే జొన్న సంకటితో లేత వంకాయ తాలింపన్నా, కాల్చిన వొర్తిచేప, వంకాయల మీద బొటనవ్రేలి దరువన్నా, చింత చివురు పప్పన్నా, మామిడి పిందెల పచ్చడన్నా, తోటాకు సాధకమన్నా మరీ మరీ మరులు పెరుగుతోంది.

ముఖ్యంగా – 'ముసలికంపు' అని చీదరించుకోకుండా డొక్కల్లో పడుకొని కథలు చెప్పించుకుంటూ నిదురించే ఆ పిల్లల ఆప్యాయత, అనురాగాలకు పులకరించిపోతున్నాడు.

ఈ మధ్య ఓసిద్ధాంతం కూడా తయారు చేశాడు.

"ప్రతి తండ్రి ఆస్తిలో కూతురికి వాటా ఇచ్చి అవసాన దశలో ఆమె దగ్గరే గడపాలి" అంటూ.

తనే ఏదీ ఇవ్వలేక పోయాడు.

ఆలోచించాడు.

చేయి మెల్లిగా బొడ్లో తడిమింది. పంచె చివరి ముడిలో జాగ్రత్తగా ఉన్నాయి తను ముచ్చటగా పెట్టుకొనే చెవి కమ్మలు.

మొన్నటిదాకా చెవులకుండేవి. జబ్బుపడినప్పుడు కోడలు పీక్కుంటుందని బొడ్లో దాచుకున్నాడు. ఎన్ని అవసరాలొచ్చినా వాటిని అమ్మలేదు తను. ఎందుకంటే అవి తన జేజి నాయన తనకు మురిపెంగా ఇచ్చినవి కాబట్టి.

గిన్నెలో అన్నం పెట్టి తీసుకొచ్చింది లక్ష్మమ్మ.

"ఇయిగో నమ్మా యియ్యి తీసుకో" అరచేయి చాచాడు.

చూసిం దామె. గ్రహించింది.

"బువ్వ దిను" అంది.

"యియ్యి దీసుకొని దాసిపెట్టుకో"

"యేడ దాచుకోవాల వాకిల్లేని యింట్లో...నీ కాన్నే పెట్టుకో." అంది నిర్లిప్తంగా.

తిరిగి బొడ్లో దోపుకొన్నాడు.

రోజులు దొర్లిపోతున్నాయి.

ఎండాకాలం దాటింది. వానా కాలం పరుగులు తీసింది. చలివలులు ధరించి మార్గశిరం వచ్చింది.

ముసలాళ్ళకు యమగండమైంది.

చలి వూపిరితిత్తుల్ని నొక్కేస్తోంది.

తెల్లార్లూ రామనామపు ఊతకర్రతో బరువుగా నడుస్తున్నాయి ఊపిరులు.

రాత్రంతా మేలుకొని ఎదల మీద అమృతాంజనం రుద్దుతూ ఏవేవో సపర్యలు చేస్తోంది ఆమె.

డాక్టరు వద్దకు తీసికెళ్ళమని చెప్పేందుకు నోరాడలేదు ఆయనకు.

తను బతకటం కష్టమనుకున్నాడు.

అప్పుడు జ్ఞప్తి కొచ్చాడు కొడుకు.

తను కసిగా వాడి చేత లెక్కవసూలు చేస్తున్నాడు. అందుకేనేమో తన్ను చూసేందుక్కూడా రాలేదు వాడు.

ఆలోచన మొదలైంది.

రాత్రి అరికాళ్ళను గోరువెచ్చటి నీటిలో కడిగి ఆముదం పట్టిస్తోన్న కూతురితో అన్నాడు– "అమ్మా? తలకొరివి పెట్టేందుకన్నా వా డొస్చడా? రాడా?" అని.

ఆయనకేసి పరిశీలనగా చూసింది ఆమె.

దీర్ఘంగా నిట్టూర్చింది.

కొడుకుచేత కార్డు తెప్పించి జాబు రాయించింది.

వారం తిరక్కుండానే అతనొచ్చాడు. పరామర్శించాడు. ఎవరో డాక్టర్ని పిల్చుకొచ్చాడు. ఇంజక్షన్లు ఇప్పించాడు. మాత్రలు తెప్పించి ఎలా వాడాలో వివరించాడు.

సాయంత్రానికి తిరిగి ఊరెళ్ళాడు.

కలలాగా జరిగిపోయింది అంతా.

మాఘమాసాంతానికి చలి తగ్గింది. ఆయాసం కూడా తగ్గిందిగాని ఆరోగ్యం కుదటపడలేదు.

ఒంట్లో శక్తి బాగా క్షీణించింది.

అప్పుడప్పుడు వంశాంకురాలు జ్ఞప్తికొస్తున్నారు. పుట్టి పెరిగిన తావు కళ్ళ ముందు మెదల్తోంది.

"వాని కొచ్చిన పెండ్లాం పెద్దమ్మ. మాట కొస్చే అలుగుద్ది. వాడేం జేస్చదు పాపం. సంసారం నాశినం జేసికొంటడా?" రాత్రి తిండి తింటూ స్వగతంలా అన్నాడు ఒకరోజు.

వింటూ అన్నం కలిపి ముద్దలు చేసి అందిస్తోంది ఆమె.

ఆయన ఆరోగ్యం అంతకంతకూ క్షీణిస్తోంది.

మంచం మీంచి లేవటం కూడా కష్టంగానే ఉంది. లక్ష్మమ్మ ఓపిగ్గా పసిపిల్లాడిలా చూసుకుంటూంది.

"అబ్బనికింత కూడెయ్యలేని ఎధవ అని లోకం తిట్టుకొంటదేమో లచ్చుమ్మా వాన్ని! నామూలంగా వానికి సెడ్డ పేరొచ్చె" బాధపడ్డాడు ఇంకోరోజు.

ఫాల్గుణ మాసపు చివరి రోజు లొచ్చేసరికి ఎండ బాగా ముదిరింది. గుండెల్లో ఆయాసం ఎక్కువవుతోంది. భరించరాని వేడిమి. శరీరమంతా సూదుల్తో పొడిచినట్లుంది.

ఒక సాయంత్రం చెవుల సోకిన వార్త ఆయన హృదయాన్ని కల్లోల పరిచింది.

కొడుకు మూన్నెళ్ల పాటు ఉద్యోగంలోంచి సస్పెండ్ అయ్యాడట.

తెగ బాధపడ్డాడు.

"వంశానికంతా సెడ్డ పేరు దెచ్చెనాకొడుకు" అంటూ వాపోయాడు.

చైత్ర మాసం దాటేసరికి వేడిని తట్టుకోలేని స్థితి వచ్చింది.

అర్ధగంట కోసారి తడిపిన గుడ్డతో వొళ్ళంతా తుడవాలి. తల మీద నీళ్లు చల్లాలి. పడకను తడి జేయాలి. గొంతును తేమ జేయాలి.

అక్కడికి "దగ...దగ...." అంటు అరుస్తున్నాడు.

అవసాన కాలం సమీపించింది. సరిగ్గా మాటలాడలేని పరిస్థితి ఏర్పడింది.

లక్షుమ్మ నిద్రాహారాలు మాని సేవలు చేస్తోంది.

బంధువులు వచ్చారు.

కొడుకు, కోడలు వచ్చారు. మనవళ్ళు వచ్చారు.

కొడుకును దగ్గరగా పిల్చుకొన్నాడు ఆయన. ఆప్యాయంగా వొళ్ళంతా తడిమాడు. చేతుల్ని వదలకుండా పట్టుకొన్నాడు.

కొడుకు కేసి చూస్తూ ఏవేవో సైగలు చేస్తున్నాడు.

లక్ష్మమ్మకు అర్థమయి అర్థంకాకుండా ఉన్నాయి ఆయన సైగలు.

అందర్నీ దూరంగా పొమ్మన్నాడు.

మినుకు మినుకు మంటోన్న కొడుకు కళ్ళల్లోకి లోతుగా చూశాడు.

ఉద్యోగం పోగొట్టుకొన్న దైన్యం కొడుకు మొగంలో ఆయనకు కొండంత కన్పించింది.

అతని చేతిని తన నడుం మీదకు లాక్కుని పంచె చెరగుకున్న ముడిని అందించి విప్పమన్నట్లుగా సైగ చేశాడు.

ముడి విప్పాడు అతను.

పాతకాలం నాటి మగాళ్ళు పెట్టుకొనే చెవికమ్మలు.

'దాచుకో' మన్నట్లు సైగ చేశాడు.

ఈ దృశ్యం కళ్ళబడినా చూడనట్లే నటించింది లక్ష్మమ్మ.

తెల్లారుజామున శ్వాస వదిలాడు ఆయన.

బంధువులు గొల్లుమన్నారు.

కొడుకు కళ్ళ నీళ్ళు పెట్టుకున్నాడు.

లక్ష్మమ్మకు దుఃఖం రాలేదప్పుడు.

తండ్రి సైగల ద్వారా వెలిబుచ్చిన కోరిక మేరకు ఆయన శవాన్ని ఊరికి తీసకెళ్ళేటప్పుడు తన్నుకొచ్చింది ఆమెకు దుఃఖం.

మొగుడు చనిపోయినప్పుడు కూడా రాని దుఃఖం, సంకటి లేక పిల్లలు బోరుమన్నప్పుడు కూడా రాని దుఃఖం.

తండ్రి చస్తానన్నప్పుడు కూడా రాని దుఃఖం.

చచ్చేముందు సైతం మరువకుండా తన్ను కూతురిగానే గుర్తుంచుకొన్న తండ్రి అపారమైన జ్ఞాపకశక్తి తల్చుకొని మరీ మరీ ఏడ్చింది.

◆ *ఆంధ్రప్రభ వీక్లీ - **26 జూలై, 1995*** ◆